# తెల్లవారనిపొద్దు

'కథక్ మిత్ర'



భుజాలమీదికి నల్లటి చీకటి విగ్గులా వెంపలమీదుగా జారిన పొడవాటి తల గుబురులూ, దువ్వంగా మాసి పిచ్చిగా పెరిగిన గడ్డమూ, మెలికలు తిరిగిన సన్నటి మీసాలూ, రెండు మూడు చిరుగులు చిరిగిన పొడవు చేతుల ఖద్దరులాల్చీ, మామిడి అంచులపంచె పీటితో నరహరి మాస్టారు స్కూలికి వచ్చారు.

స్కూలు బయట

వీరన్నగారి బాబిగాడినీ, గవరయ్యగారి పుల్లిగాడినీ, వెంకయ్యగారి రాంపండుగాడినీ, సద్దరాజుగారి సత్తిగాడినీ, ఆచార్యులగారి లచ్చుబాబుగాడినీ, నరిసింహశాస్త్రిగారి నానిగాడినీ ఇంకా చాలామందిని చేరదీసి రామన్నగారి గోపిగాడు చెడుగుడు ఆడుతున్నాడు.

ఆడపిల్లలు బడిముందు ఇసకవుంతవార "కిరికీ" ఆడుకుంటున్నారు. మరీ చిన్నపిల్లలు దూదుంపుల్లాట ఆడుకుంటున్నారు. ఇద్దరు ఒప్పులకుప్ప తిరుగుతున్నారు. అవతల రావఉసిరిచెట్టు కింద ఇంకా కొందరు చెమ్మచెక్క ఆడుకుంటున్నారు. అక్కడ ఆనందమే గిరగిరా తిరుగుతూంది. చిరునవ్వులే తుళ్ళుతున్నాయి.

కాని వీటన్నిటికీ కొంచెం దూరంలో అన్నిటికీ అతీతుడిలా అమాయకుడిలా నిలిచిపోయిన ఓ కుర్రాడున్నాడు.

వచ్చిన మేష్టారిచూపు ఆ కుర్రాడిమీద పడింది.

నల్లచందనపు బొమ్మలా ఉన్నాడు ఆ కుర్రాడు. తలగుడ్డా, తాడుకర్రా, పొట్టిఅయిన చిరుగుల మాసిన చొక్కాతో ఆ అబ్బాయి పేదగా, బితుకుబితుకుగా చూస్తూ ఉండిపోయాడు.

చలికి కొంకర్లు పోతూన్న శరద్రాత్రి చీకట్లలో వెలుగులు చేసుకొన్న చలిమంటలముందు చుట్టూ గుండ్రంగా చేరి శరీరాల్ని వెచ్చచేసికొని మంట కాచుకునే రైతుబిడ్డడిలా, మందబయళ్ళలో పశువుల్ని మేపే పాలికాపు కుర్రాడిలా, గోటికాయలూ, కోతికొమ్మచ్చిలూ, కుప్ప తన్నులాటలూ ఆడే ఆకతాయిలా ఆ కుర్రాడు కనపడనే లేదు.

ఆ కుర్రాడు చూస్తూన్న చూపు అతనికి సరిపడ్డ చూపులా లేనేలేదు. వాడిముఖంలో కళ చిలాయి చుక్కబొట్టు. ఆ కళ్ళల్లో ఆశాజ్యోతులు కొటిగట్టిన నిరాశవెలుగులు. పరవళ్ళు తొక్కే ఉత్సాహం హృదయం లోనే బందీ అయిపోయి చిరునవ్వు ఎండిపోయిన పెదవులు.

జాలి వేసింది మాష్టారికి. నిట్టూర్చి, దగ్గర్లో ఆడుకుంటున్న గోపాలాన్ని పిలిచి తాళాలిచ్చి తలుపులు తియ్యమన్నారు ఆయన. పిల్లలంతా చేతులు దులుపుకుని పుస్తకాలూ, పలకలూ పట్టుకుని బడిలోపలికి వెళ్ళారు. మాష్టారింకా ఆ కుర్రాడినే చూస్తూ నిలబడ్డారు.

ఒకామె వచ్చి మేష్టారికి నమస్కారించింది.

"నాను అబ్బిగాడి తల్లినండి. ఎటుండీ, తవరు కొత్త మేష్టారుంటగదుండీ. రావన్నగారు సొప్పారు తవరికి సొప్పమని. ఆడేమో నాలుగో గళాసు సదువుతున్నాడుండి. తండ్రి సూడాత్తేనేమో పొట్ట సేత్తో వట్టుకుని అండుమాను పోయాడు. ఇప్పుడు రంగం లేదుగందా మరి. అణ్ణించి మనొద్రు రాలేదంటున్నారు పొట్టుమేను. పొట్ట గడక మా అమ్మగారింటికాడ దిగమెట్టాను. తిండెట్టక తప్పి తగిలేశారు బుల్లోడిని. సూడాత్తే కూల్నాలిసేవ్ టయిం కాదుగందా. ఏం దిగమారి సావనూ. మనకెందు కొచ్చిన సతువుల్రా. మానేసి రావన్నగారి దూళ్ళకాడుండమన్నాను. పాలేరు తన పెట్టాను. ఏటుండీ! ఆవుల్నీ, గేదెల్నీ కాయడవే గందాండి, ఓ పూట కూడెట్టే కాసింత పాణం రచ్చించువారుగందా. ఇంత గంజి పొయ్యలేని పాపిట్టేదాన్ని. నా పాణాలు తోడేత్తన్నాడు. నాను సతువుకుంటానంటాడు. ఈ దేటిది ఊళ్లేల్తాడా లేపోతే ఉద్యోగమే సేత్తాడా? సెప్పండి. తవరైనా కాసంత గడ్డెటుందాడికి" అంది.

ఏటొఒడ్డున ఒంటరిగా, నిటారుగా, నిలువుగీతలా నిలబడ్డ ఓ కొబ్బరిచెట్టు ఏటినీటిలో పడి వక్రీభవించి కనబడ్డట్టు ఆమె నుదుటిమీద పచ్చబొట్టు, మాట్లాడుతున్నప్పుడు వంపులు పోతూ కనిపించింది.

"నీ పేరేమిటి?"

గుచ్చుకుపోయిన ముళ్ళు. సర్వీజువ్వ దెబ్బలకి తట్టు తేరినచోట ఎఱ్ఱగా రక్తం చర్మం కిందవరకూ వచ్చి ఆగిపోయింది. ఏచ్చి ఏడ్చి అబ్బిగాడు సొమ్మసిల్లి పోయినట్టున్నాడు!

మేష్టారు వాణ్ణి లేవదీసి కూర్చోబెట్టారు. కళ్ళు తెరిచి మేష్టార్నిచూసి బావురుమన్నాడు వాడు.

ముళ్ళు గుచ్చుకుపోయి కదలలేకపోతున్న వాణ్ణి అమాంతం భుజంమీద వేసుకుని తన జ్వరం, నీరసం సంగతే మరిచిపోయి మేష్టారు హడావిడిగా ఇంటికి తీసుకు వచ్చారు. ఎప్పుడు తెలిసిందోగాని లక్ష్మమ్మ శోకాలు పెట్టుకుంటూ పరిగెత్తుకుంటూ వచ్చింది. ఒక్కగానొక్క కొడుక్కు జరిగిన అన్యాయానికి ఆమె నోటికి వచ్చినట్లల్లా వూరివాళ్ళని తిడుతూంది. జనం పోగుపడి వింత చూసినట్టు చూసి గుసగుసలాడి వెళ్ళిపోతున్నారు. మాష్టారేం పట్టించుకోలేదు. ఆయనకు తెలుసు. గోపిగాడు అబ్బిగాడిని ఏమని తిట్టాడోకూడా పండుగాడు చెప్పాడు.

మేష్టారు ఆచారికి కబురు పంపించారు. కాని ఆయన వచ్చేవరకూ లక్ష్మమ్మ కొడుకుని అక్కడ ఉంచలేదు. "నేను సూసుకుంటాలే బాబు, నీ కెందుకు సెమ" అంటూ కుఱ్ఱాడ్ని తీసుకుపోయింది.

ఆ సాయంకాలానికి అబ్బిగాడికి ఒళ్ళు తెలియని జ్వరం వచ్చేసింది. మాష్టారికికూడా ఒంట్లో బాగా లేదు. పండుగాడే ఆ వార్త తీసుకువచ్చాడు. మాష్టారికి ఒకసారి అబ్బిగాడింటికి వెళ్ళి వద్దామనివున్నా ఓపిక లేకపోయింది.

మరునాడు స్కూలుకి ఎలాగో వెళ్ళారు. పాఠాలు జరగలేదు. మనసు, శరీరము రెండూ మేష్టారి స్వాధీనంలో లేవు. అబ్బిగాడి జ్వరం తగ్గుముఖం పట్టలేదట. స్కూలు విడిచి పెట్టాక మేష్టారు వెళ్ళి చూసివచ్చాడు. ఒళ్ళు తెలియని జ్వరంలోపడి ఉన్నాడు వాడు.

ఆ జ్వరం ఆ మరునాడుకూడా అతని ఒంటిమీద అలాగే నిలిచి ఉంది. ఆచారిగారే మందిస్తున్నారు. కొడుకు జడుసుకున్నాడేమోనని లక్ష్మమ్మ ఎండుమిరప కాయలు కాల్చి దిష్టి తీసింది.

నాలుగో రోజున మేష్టారు ఒకసారి వెళ్ళి అబ్బిగాడ్ని చూసివద్దామని అనుకున్నారు గాని వాతావరణం చలిచలిగా ఉండి జ్వరం వచ్చినట్టుగా అనిపించి వెళ్ళలేకపోయారు. ఆ రోజు అన్నంకూడా వండుకోలేదు. కాఫీ కాచుకుని తాగి పెందరాళే పడుకున్నారు. పడుకున్నారన్న మాటేగాని ఎంతకీ నిద్ర పట్టలేదు.

సముద్రం పొంగి పొరలే ఘోష విషాదపూరితంగా వినిపిస్తూంది.

దూరంనించి నక్కలఅరుపులూ, దగ్గర్లో కీచురాళ్ళ ఇలకోళ్ళధ్వనులూ, చెట్లమీద ఎగిరిన తపసిపక్షుల రెక్కల రెపరెపల సందడులూ, గుడ్లగూబల భయంకర మయిన అరవులూ వినిపిస్తున్నాయి. ఎప్పటిరాత్రిలా ఈ రాత్రిలేదు. హృదయాన్ని వేధిస్తూంది. విషాద గీతాన్ని ఆలపిస్తున్నట్టుంది.

లేచి, తలుపు తీసుకుని అరుగుమీదికి వచ్చారు మేష్టారు.

పగలు పది మందీ నడిచి వెళ్ళగా అచ్చు గుద్దిన అడుగుజాడలతో సీంమండల లోతు దిగబడిపోయే ఇసకవుంత మధ్యగా రైలుపట్టాల్లాంటి బండిగాడి సమాంతరరేఖలబాటలో ఎవరో విరిచి పారేసిన పగిలిన గాజుముక్కమీద పడిన మసకవెన్నెల పరావర్తిత కాంతిరేఖ ఆయన కళ్ళల్లో గుచ్చుకుంది.

విడివిడిగా అక్కడక్కడ చెల్లాచెదురుగా విసిరి పారేసినట్టున్న వూరిగుడిసెలలోనూ, కలివిడిగా వరసలు తీరిన తాటాకు లోగిళ్ళలోనూ, కలిగినవారి పెద్ద పెంకుటిళ్ళనుండునా, మబ్బులవెనక మసుగుపడి మెరిసే చుక్కల్లా చెట్లగుబురుల చాటున వెలిగే ఇలాయిబుడ్ల కిరసనాయిలుదీపాల వెలుతురులో వీధివాకిళ్ళలో వేలాడు తున్నాయి.

అయిదు నిమిషాలు అలానే నిలుచుని లోపలికి వెళ్ళిపోదామని కదలబోయి ఆగిపోయారు నరహరి మేష్టారు. హరికెనులాంతరు పట్టుకుని ఎవరో హడావిడిగా ఇటేవస్తున్నారు. ఆ వస్తున్న వ్యక్తి సేరుగా ఇంటిదగ్గిరికే వచ్చి ఆగాడు.

"అయ్యా! పంతులయ్యా! అబ్బిగాడికి భూమ్మీద నూకలు సెల్లిపోయాయయ్యా. నొట్టని నూరేళ్ళ పంట రాసేసేడు భగవంతుడు. . ."

నరహరిమేష్టారి కళ్ళముందంతా చీకటిగా ఉంది. ఆ చీకట్లో ఓ మూల చిన్న వెలుగురేఖ, అక్కడో క్లాసురూము, అందులో ఎన్నికల వాతావరణం, మధ్య తను, చుట్టూ పాములూ, పెద్దపులులూ, తోడేళ్ళూ, సింహాలూ, వాటన్నిటిమధ్యా రక్తసిక్తమైన ఓ లేగదూడ.

"నేనే. . .నేనే" అంటూ పిచ్చిగా అరిచారు మేష్టారు!

వచ్చిన వ్యక్తి అర్థం కాక తెల్లబోయాడు! ★


# పురుషుల అవసరాలు తీరుటకు
# ఒకాసా






ఒకాసా పురుషులు సఫలజీవితమును పొందుటకు శక్తిని యిస్తుంది. అకాలంగ వయస్సు మళ్ళడం అరికట్టి, ఆరోగ్యమును మెరుగు, అన్నిటికంటె ముఖ్యంగ, యౌవన విక్రమము, సత్తువను కలుగ యిస్తుంది. లక్షలాది ప్రజలు ప్రపంచమంతటా ఒకాసా, ఆధునిక టానిక్ – రెస్టోరేటివ్ బిళ్ళలు ఉపయోగిస్తున్నారు. ఒకాసా, పురుషులకు, స్త్రీలకు వేరువేరుగా లభిస్తాయి.

కెమిస్టులందరివద్ద, దొరుకుతాయి: లేక మాకు వ్రాయండి:

**OKASA CO. PVT. LTD.** P. O. BOX 396, BOMBAY-1.

CU.347